


దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 342 సోమవారం 9-12-2024 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

# తెలంగాణ తల్లి పండుగ

**- ఏటా డిసెంబరు 9న అవతరణ ఉత్సవం - నేడు అసెంబ్లీలో ప్రకటించనున్న సీఎం రేవంత్**

**- విగ్రహం ఆవిష్కరణకు ముందే ఉత్తర్వులు - నేటి నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు - అస్త్రశస్త్రాలతో సిద్ధమైన అధికార, విపక్షాలు**



**హైదరాబాద్, డిసెంబరు 8:** రాష్ట్ర సచివాలయంలో సోమవారం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నేపథ్యంలో ఇకపై ఏటా డిసెంబరు 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఉత్సవం సందర్భంగా రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం' ఆలాపన జరగనుంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం శాసనసభలో ప్రకటన చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి తొలి ప్రకటన 2009 డిసెంబరు 9న వెలువడిన విషయం తెలిసిందే. దీంతో ఆ రోజును పండుగలా నిర్వహించాలన్న నిర్ణయానికి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు.. ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానుండగా.. తొలి రోజు సమావేశంలోనే తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవంపై ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేయనున్నారు. దీంతోపాటు విగ్రహం రూపకల్పన తదితర అంశాలపైనా ప్రకటన చేస్తారు. అనంతరం ఆ ప్రకటనపై సభలో చర్చ జరగనుంది. చర్చ ముగిసిన తర్వాత తెలంగాణ తల్లి ఉత్సవాల నిర్వహణపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది. ఉత్తర్వులు జారీ అయ్యాక.. సచివాలయంలో జయజయహే తెలంగాణ గీతాలాపన నడుమ.. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఆ విగ్రహ శిల్పి రమణారెడ్డికి, జయ జయహే గీత రచయిత అందెశ్రీకి సన్మానం చేస్తారు. ఈ సందర్భంగా గద్దర్, గూడ అంజన్న వంటి కళాకారుల త్యాగాలకు గుర్తుగా ఓ ప్రకటన కూడా చేసే అవకాశం ఉంది.

**సోనియాకు జన్మదిన కానుక..!**

ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని 2009లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసిన సంగతి తెలిసిన విషయమే. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీనే తెలంగాణకు తల్లి అంటూ కాంగ్రెస్ ముఖ్య నాయకులు ప్రకటనలు కూడా చేస్తుంటారు. తాజాగా సోనియాగాంధీ పుట్టిన రోజున తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి.. ఏటా అదే రోజున ఉత్సవాలు నిర్వహించాలన్న నిర్ణయానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రావడం ఒక రకంగా ఆమెకు ఇస్తున్న జన్మదిన కానుకేనని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

**ఏడు పనిదినాల పాటు సమావేశాలు..**

సోమవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఐదు నుంచి ఏడు పని దినాలపాటు కొనసాగే అవకాశం ఉంది. పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మంగళ, బుధ వారాలు విరామం ఇచ్చే అవకాశం కూడా ఉందని చెబుతున్నారు. తొలిరోజు సమావేశానంతరం స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన జరిగే బీఏసీ భేటీలో సమావేశాల అజెండాపై స్పష్టత రానుంది. అయితే ఈ సమావేశాల్లో ప్రధానంగా రెవెన్యూ శాఖకు సంబంధించి ఆర్‌వోఆర్-2024 బిల్లుపైనే చర్చ జరగనుంది. అలాగే ముగ్గురు పిల్లలు ఉన్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం, ప్రతి మండలంలోనూ కనీసం ఐదు ఎంపీటీసీలు ఉండేలా నిబంధన, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారు, ఒకే పర్యాయానికి వర్తింపు వంటి సవరణలు చేస్తూ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లునూ ఈ సమావేశాల్లోనే చర్చకు పెట్టనున్నారు. కాగా, జీతాలు, పింఛను చెల్లింపు, అనర్హతల తొలగింపు, పురపాలక సంఘాలు, జీహెచ్ఎంసీ, వస్తు సేవల పన్ను చట్టాలకు సంబంధించిన సవరణ బిల్లులను ప్రవేశ పెట్టనున్నారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసాను కచ్చితంగా అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో రైతు భరోసా విధివిధానాలపైనా ఈ సమావేశాల్లోనే చర్చించనున్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా సాధించిన విజయాలపైనా సీఎం రేవంత్ ప్రకటన చేసే అవకాశం ఉందంటున్నారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం మూసీ ప్రక్షాళన, హైడ్రా కూల్చివేతలు చేపట్టిన తర్వాత జరుగుతున్న సమావేశాలు కావడంతో హెూరాహెూరీగానే చర్చ జరిగేందుకు ఆస్కారం ఉందంటున్నారు. ఈ అంశాలపై సభను వేదికగా చేసుకుని సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర వివరణ ఇచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. అదే సమయంలో ఏడాది పాలనా వైఫల్యాలపై చార్జిషీట్లు విడుదల చేసిన బీఆర్ఎస్, బీజేపీ. ఈ సమావేశాల్లో ప్రభుత్వంపై ఎదురుదాడి చేసేందుకు అస్త్ర శస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి.

## బండి సంజయ్ వ్యాఖ్యలు సరికాదు..

**క్యాబినెట్‌లో అర్బన్ నక్సలైట్లు ఉన్నారనడంలో ఆంతర్యమేంటి?: సీతక్క**



**మహబూబాబాద్, డిసెంబరు 8:** రాష్ట్ర క్యాబినెట్‌లో అర్బన్ నక్సలైట్లు ఉన్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అనడంలో ఆంతర్యమేమిటని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రశ్నించారు. ఆదివారం మహబూబాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. తాను ఉద్యమాల నేపథ్యం నుంచి వచ్చిన మాట వాస్తవమేనని, ఉద్యమాల నుంచి బయటకు వచ్చాక ఐదేళ్లు న్యాయవాదిగా పనిచేశానని, 3 సార్లు ములుగు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించానని, 20 ఏళ్ల తర్వాత ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. తనను రాజకీయంగా దెబ్బ తీయడానికే ఇలాంటి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.బీజేపీ ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్ నేపథ్యం ఏమిటో చెప్పాలని, ఆయన కూడా వామపక్ష భావజాలం నుంచి వచ్చినవారే కదా అని ప్రశ్నించారు. తాను తొలుత ములుగు ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో టీడీపీ, బీజేపీ అలియన్స్‌లో పోటీ చేశానని, అప్పుడు బీజేపీకి తాను అర్బన్ నక్సలైట్‌నని గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు. ఏడాది కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ చార్జ్‌షీట్ వేసిందని, అందులో ఏమి చెప్పదలుచుకుందని నిలదీశారు.

## నకిలీ రోగులను చూపిస్తే కఠిన చర్యలు

**తనిఖీల్లో గుర్తించేందుకు ఎన్ఎంసీ కొత్త మార్గదర్శకాలు**

**ఎక్కువమంది రోగులు చేరుతున్నట్లుగా చూపాలని బోధనాస్పత్రుల అడ్డదార్లు**

**చెక్ పెట్టేందుకు ఎన్ఎంసీ చర్యలు**

**కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు దరఖాస్తులు.. జనవరి 5 తుది గడువు**

**సీట్లను 100కు పెంచే యోచనలో సర్కారు**

**హైదరాబాద్, డిసెంబరు 8:** చాలా మెడికల్ కాలేజీలు తమ బోధనాస్పత్రుల్లో రోగులు లేకపోయినా... 'బెడ్ ఆక్యుపెన్సీ' కోసం నకిలీ రోగులను చూపిస్తుండడాన్ని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) తీవ్రంగా పరిగణిస్తోంది. ఎన్ఎంసీ బృందాలు తనిఖీకి వచ్చే సమయంలో ఆస్పత్రుల యాజమాన్యాలు ఇలా చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని పేర్కొంది. ఆస్పత్రుల్లో ఉన్న రోగులు అసలా నకిలీయా తేల్చేందుకు ఎన్ఎంసీ ఈసారి కొత్తగా మార్గదర్శకాలు విడుదల చేసింది. తనిఖీల సమయంలో పెద్దసంఖ్యలో రోగులు అడ్మిట్ అయి ఉంటే... అంతకుముందు కొన్ని రోజులు వరుసగా ఇదే తరహాలో రోగులు ఉన్నారా లేదా అని పరిశీలిస్తామని వెల్లడించింది. పిల్లల వార్డులో చిన్నారులు ఎటువంటి అనారోగ్యం లేకుండా ఆడుకుంటూ ఉన్నా నకిలీ పేషెంట్ల కింద పరిగణిస్తామని తెలిపింది. ఒకే కుటుంబం నుంచి ఎక్కువమంది అదే ఆస్పత్రిలో చేరినా, ఎక్కువమంది వైద్య శిబిరం పేరుతో ఆస్పత్రికి వచ్చినా వారిని నకిలీ రోగులుగా గుర్తిస్తామని పేర్కొంది. నకిలీ రోగులను చూపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్ఎంసీ హెచ్చరించింది. కాగా, కొత్త వైద్య విద్య కళాశాలల ఏర్పాటుకు ఎన్ఎంసీ దరఖాస్తులు ఆహ్వానించింది. ఇప్పటికే ఉన్న కళాశాలల్లో ఎంబీబీఎస్, పీజీ సీట్ల పెంపునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వచ్చే ఏడాది జనవరి 4 వరకు గడువు ఉందని తెలిపింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు సమాచారం పంపింది. దరఖాస్తులకు మార్గదర్శకాలు విడుదల చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరి?ధిలోని వైద్య కళాశాలల్లో అదనపు పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకుంటే వాటిని తనిఖీల నుంచి మినహాయిస్తామని పేర్కొంది. వారిచ్చే స్వీయ ధ్రువీకరణ, సమర్పించే పత్రాల ఆధారంగా భౌతిక తనిఖీల నుంచి మినహాయిస్తామని తెలిపింది.

## అమ్మా.. నన్ను చంపొద్దే.. ప్లీజ్..!!

**ఆరేళ్ల కొడుకును బావిలోకి తోసి తాను దూకిన తల్లి**

**తొలుత కూతురిని నెట్టేందుకు యత్నం**

**చంపొద్దని వేడుకోవడంతో చిన్నారిని వదిలేసిన వైనం**

**అక్కడికక్కడే మృత్యువాత పడిన తల్లీకొడుకులు**

**వికారాబాద్ జిల్లా గేటువనంపల్లిలో ఘటన**



**నవాబుపేట/ వికారాబాద్, డిసెంబరు 8:** వికారాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. ఓ మహిళ ఆరేళ్ల వయస్సు ఉన్న తన కన్నకొడుకును బావిలోకి తోసేసి.. అనంతరం ఆమె కూడా బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆ మహిళ తొలుత తన కూతురిని బావిలోకి నెట్టాలని ప్రయత్నించగా.. "అమ్మా నన్ను చంపొద్దు ప్లీజ్" అని వేడుకోవడంతో ఆ చిన్నారిని వదిలేయడంతో ఆ బాలికతో ప్రాణాలతో మిగిలింది. వికారాబాద్ జిల్లా, నవాబ్‌పేట మండలం, గేటువనంపల్లి గ్రామంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు, గ్రామ ప్రజల కథనం ప్రకారం.. గేటువనంపల్లికి చెందిన గుల్ల రాములు మోమిన్‌పేట మండలం టేకులపల్లికి చెందిన అరుంధ(32)ను 2008లో రెండో వివాహం చేసుకున్నాడు. రాములు మొదటి భార్య అప్పటికే మరణించింది. రాములు, అరుంధ దంపతులకు కూతురు ప్రజ్వల(11), కొడుకు రిత్విక్(6) ఉన్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం రాములు శనివారం పొలానికి వెళ్లగా... గేటువనంపల్లికే చెందిన శేఖర్ అనే వ్యక్తితో అరుంధ ఫోన్‌లో మాట్లాడింది. అనంతరం సాయంత్రం నాలుగు గంటలప్పుడు ప్రజ్వల, రిత్విక్‌ను వెంటబెట్టుకుని పొలానికి బయలుదేరింది. దారిలో ఓ బావి వద్ద ఆగి శేఖర్‌తో మరోసారి ఫోన్‌లో మాట్లాడి గుడ్ బై చెప్పింది. ఆ తర్వాత ప్రజ్వలను బావిలోకి నెట్టేందుకు యత్నించగా.. చంపవద్దని ఆమె ఏడవడంతో వదిలేసింది. అనంతరం రిత్విక్‌ను బావిలోకి తోసేసి ఆమె కూడా దూకేసింది. ఘటనా స్థలి నుంచి గ్రామానికి వచ్చిన ప్రజ్వల జరిగిన విషయం కుటుంబసభ్యులకు చెప్పగా బావి వద్దకు చేరుకున్నారు. అప్పటికే తల్లీకొడుకులు చనిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం ఉదయం మృతదేహాలను వెలికి తీయించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ఆస్పత్రికి తరలించి.. అరుంధ తల్లి కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన చరిత్ర బీఆర్ఎస్‌దే

**ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



**యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 8:** తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన చరిత్ర బీఆర్ఎసదేనని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆదివారం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా గుట్టలో ఆలేరు నియోజకవర్గస్థాయి సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంలోనే ఆలేరు అభివృద్ధి చేయడానికి రూ.500 కోట్లు, తీసుకొచ్చానని ఇప్పటివరకు రూ.360కోట్లతో పనులు పూర్తిచేశానని తెలిపారు. గత ప్రభుత్వం ఆలేరుకు ఎగువన ప్రాజెక్టులు నిర్మించిందే తప్ప చుక్కనీరు ఇవ్వలేదన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ, తపాసుపల్లి రిజర్వాయర్ల ద్వారా బీర్ల ఫౌండేషన్ సహకారంతో రూ.80లక్షలు ఖర్చుచేసి గొలుసుకట్టు కాల్వలకు మరమ్మతులుచేసి ఇప్పటి వరకు నియోజకవర్గంలో సుమారు 120 చెరువులను నింపానని, తాగునీటి కోసం రూ.210కోట్లు మంజూరు చేయించి మిషన్‌భగీరథ పెండింగ్ పైపులైన్ల పనులు మూడు నెలల్లోపు పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా రోడ్ల మరమ్మతులకోసం ఇప్పటివరకు రూ.110కోట్ల నిధులు మంజూరు చేయించానని మరో రూ.100కోట్లు అనుమతులు రాబోతున్నాయని, ఇప్పటివరకు రూ.22కోట్ల ఎన్ఆర్జీఎస్ అభివృద్ధి పనులు పూర్తిచేశామన్నారు. ఆలేరు నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరవతున్నాయని సీఎం, మంత్రుల సహకారంతో మరో 1000 ఇళ్లు అదనంగా మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అన్నం సంజీవరెడ్డి, నార్మల్ చైర్మన్ గుడిపాటి మధుసూధన్‌రెడ్డి, ఆలేరు, మోత్కురు మార్కెట్ కమిటీల చైర్మన్ చైతన్యరెడ్డి, నూనెముంతల విమలవెంకటేషగౌడ్, రాజేష్, యాదగిరిగుట్ట మునిసిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ నరేందర్‌గుప్త, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, గంధమల్ల అశోక్, తండ మంగమ్మశ్రీశైలంగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాల్‌రాజ్‌గౌడ్, వెంకటేశ్వర్‌రాజ్, మల్లేశం, శంకర్‌నాయక్, భాస్కర్‌రెడ్డి, ముడిగె పెంటయ్య, కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేశ్‌యాదవ్, గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు బందారపు భిక్షపతిగౌడ్, సుడుగు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనపై చార్జ్‌షీట్ వేసే నైతికత బీఆర్ఎస్‌కు లేదు

**తెలంగాణ తల్లిపై ప్రేమ ఉన్న ప్రతి ఒక్కరూ విగ్రహావిష్కరణకు వస్తారు: మంత్రి కోమటిరెడ్డి**

**హైదరాబాద్, డిసెంబరు 8:** ఏడాది కాంగ్రెస్ పాలనపై చార్జ్‌షీట్ వేసేంత నైతికత బీఆర్ఎస్‌కు లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రాష్ట్రం ఏర్పడగానే దళితుడినే సీఎం చేస్తానని, ఇంటికో ఉద్యోగమిస్తామని చెప్పి.. అవి చేయలేకపోయిన కేసీఆర్‌పై అప్పుడు ఎందుకు చార్జ్‌షీట్ వేయలేదని మండిపడ్డారు. సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఏర్పాట్లను ఆర్ అండ్ బీ శాఖ ముఖ్య కార్యదర్శి వికాసరాజ్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై బీఆర్ఎస్ చార్జ్‌షీట్ విడుదల చేసిన నేపథ్యంలో ఘాటుగా స్పందించారు. తెలంగాణ కోసం శ్రీకాంతాచారి చావునోట్లో తలపెట్టి చనిపోయాడని, మరి కేసీఆర్ ఎలా బయటపడ్డారో ప్రజలకు తెలుసన్నారు. హరీశ్, కేటీఆర్‌లది



రాజకీయ ఉనికి కోసం చేసే ఆరాటమే తప్ప.. వారిది నిజమైన ప్రతిపక్ష పాత్రకాదని చెప్పారు. సోమవారం నిర్వహించే తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని అన్ని రాజకీయ పక్షాలను ఆహ్వానించామని తెలిపారు. తెలంగాణ, తెలంగాణతల్లిపై ప్రేమ ఉన్న ప్రతి ఒక్కరూ కార్యక్రమానికి వస్తారని, తెలంగాణ అంటే ఇష్టం లేనివారు రారని అన్నారు. నిజమైన తెలంగాణవాదులెవరో తెలిసే వేదిక ఇదేనని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహానికి ఇరువైపులా ఏర్పాటు చేస్తున్న వేదికలకు సం బంధించి అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. సచివాలయ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు.

## అందరూ సహృదయంతో జరుపుకునే పర్వదినమే క్రిస్మస్

**క్రాస్ ఫెలోషిప్ సిల్వ సాహసం ఫాస్టర్ డాక్టర్ శామ్యూల్**
**ఘనంగా మినీ క్రిస్మస్ వేడుకలు**



**తొలి సమయం నర్సంపేట డిసెంబర్ 8:**
అందరూ సహృదయంతో జరుపుకునే పర్వదినమే క్రిస్మస్ అని క్రాస్ ఫెలోషిప్ సిల్వ సాహసం ఫాస్టర్ డాక్టర్ శామ్యూల్అన్నారు.ఆదివారం కొత్తగూడ మండల కేంద్రంలో ఘనంగా మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వాహించి ప్రత్యేక పార్ధనలు చేసి ప్రభువును స్మరిస్తూ పాటలు పాడుతూ ఊరేగింపు నిర్వహించి ఈ సందర్భంగా డాక్టర్ శామ్యూల్ మాట్లాడుతూ..ఏసు అందరికీ మంచి మార్గ నిర్దేశకులని ఏసుక్రీస్తు మానవులకు శాంతి, సమాధానం, నిత్యజీవమును అనుగ్రహించుటకు మరియు పాపిని ప్రేమించి వారి పాపము నుంచి విడిపించుటకు ఆయన వచ్చాడని తెలిపారు. యేసుక్రీస్తు ఒక మతము స్థాపిం చడానికి రాలేదు. కానీ పరలోకానికి ఆయనే ఏకైక మార్గమని తెలియజేశారు.జంగాల వెంకటరమణ నర్సింహారావు,మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## మోడీ చలవతో పెరుగుతున్న ధరలు

**తొలి సమయం హైదరాబాద్,**
విపక్షాలు విమర్శిస్తున్నా..మోడీ తన పాతధోరణిలో...మూస ధోరణిలో ముందుకు సాగుతున్నారు. దేశంలో సామాన్యులు పడుతున్న కష్టాలకు కాలం చెల్లడం లేదు. తాజాగా వంటనూనెల ధరల పెరుగుదలతో సామాన్యుడి నడ్డి విరిగింది. ఒక్క రోజులోనే లీటర్‌కు 15 నుంచి 25 రూపాయలు పెరిగాయి. ఉల్లిపాయలు 65 రూపాయలకు కిలో చేరింది. పప్పుల ధరలు మాత్రం చెప్పనక్కరలేదు. ధరలు దిగి రావడం లేదు. రూపాయి అందకుండా పోతోంది. గతంలో పైసకు ఉన్న విలువ నేటి రూపాయికి లేదు. బాలాపూర్ లడ్డూ ధర పెరిగినట్లుగా రోజురోజుకు ధరలు తాండవం చేస్తున్నాయి. అన్నపూర్ణగా ఉన్న భారత్‌లో అన్ని రకాల పంటలు పండుతున్నా సామాన్యులకు మాత్రం సరుకులు అందడం లేదు. ధరలు దకకడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మోడీ తన జన్మదినం సందర్భాగా ఇలాంటి సమస్యలు సమీక్షించుకుని ఉంటే మంచి ప్రధానిగా రాణించేవారు. కానీ పొగడ్తలకు అలవాటు పడ్డ కారణంగా క్షేత్రస్థాయిలో ఏమి జరుగు తుందో తెలుసుకోలేక పోతున్నారు. ఉద్యోగ ఉపాధి రంగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బిజెపి నేతలు కూడా మోడీ భజనలో మునిగి పోయారు. సమస్యలు తెలుసుకోవడం...తెలుసుకున్న సమస్యలను ప్రధానికి వివరించడం అన్నది లేకుండా పోయింది. అంతెందుకు ఎపిలో కేంద్రమంత్రులుగా ఉన్న రామ్మోహన్ నాయుడు వంటి వారు రాష్ట్రానికి ఏం చేద్దామా అని ఆలోచించి, నిధులు విడుదల చేయించుకుని అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారు. కానీ తెలంగాణలో ఉన్న ఇద్దరు కేంద్రమంత్రులు కిసన్ రెడ్డి, బండి సంజయ్‌లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టి పోయడానికే సమయం తీసుకుంటున్నారు. సామాన్యులు సమస్యల్లో చిక్కుకుని ఏడుస్తుంటే..ఆదానీ, అంబానీ లాంటి వారు మాత్రం ఆస్తుల్లో ఎవరెస్ట్ అంత ఎత్తుకు చేరిపోతున్నారు. వారి ఆస్తులు అమాంతంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థలను వారికి అప్పగించే పని ఆగడం లేదు. వడ్డించే వాడు మనవాడైతే ఏ బంతిలో కూర్చుంటే ఏమిటి ? అన్న సామెత ఇప్పుడు మన దేశ కుబేరుల్లో ముందు వరసలో ఉన్న ఆదానీకి బాగా సరిపోతుంది. ఎందుకంటే ఆయన చేసే వ్యాపారం కన్నా.. పొందుతున్న సహకారం వల్లనే ఈ స్థాయికి చేరారని చెప్పడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. ఆసియా కుబేరుడు గౌతమ్ అదానీ సంపదలో మరో మెట్టు ఎక్కడంలో ఆయన వెనక ఎవరున్నారు..ఎవరు సహకారం అందిస్తున్నారో దేశంలోని సామాన్యులకు కూడా తెలుసు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మించుకున్న గంగవరం పోర్టు, నెల్లూరులోని పోర్టులు అన్నీ ఆదానీ పరం అయ్యాయి. గత జగన్ ప్రభుత్వం దగ్గరుండి వాటిని ఆదానీకి కట్టబెట్టారు. ఇదంతా మోడీ చలవ వల్లనే అని వేరుగా చెప్పనక్కరలేదు. గంగవరం పోర్టుకోసం భూములు ఇచ్చి త్యాగం చేసిన జాలర్లు ఆగమయ్యారు. గంగవరం పోర్టుతో పాటు విశాఖ ఉక్కును కూడా మోడీ ప్రభుత్వం అప్పనంగా కార్పేరేట్లకు కట్టబెట్టే ఆలోచన చేశారు. తాత్కాలికంగా ఈ ప్రక్రియ నిలిచిపోయినా... దీని రోణకు ఒక్క ప్రకటనా చేయడం లేదు.

# సైన్స్ ఫెయిర్ లో రాణించిన మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు

**అధ్యాపక బృందాన్ని, రాణించిన విద్యార్థులను, అభినందించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**తొలి సమయం జయశంకర్ భూపాలపల్లి:**
జిల్లా కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో ఆదివారం సీనియర్ నిర్వహించిన జిల్లాస్థాయి విజ్ఞాన శాస్త్ర పరిశోధనలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థులు వేముల సాయిచరణ్, ఎస్ సాయిచరణ్ లు మురికి నీటిని శుద్ధీకరణ చేయడం ఎలా అనే అంశంపై పరిశోధన ప్రాజెక్టు చేశారు. అలాగే బండారి శివ యాదవ్, అరుణ్ కుమార్ లు ఇండస్ట్రియల్ లో కెమికల్ విడుదలయ్య సమయంలో సిగ్నల్స్ ను ఎలా కనిపెట్టాలో తెలుసుకునే అంశంపై పరిశోధన ప్రాజెక్టు చేశారు. ఈ రెండు ప్రాజెక్టులు చేసిన విద్యార్థులు వారు చేసిన ఆయా పరిశోధన ప్రాజెక్టుల గురించి న్యాయ నిర్ణేతలకు వివరించి ద్వితీయ బహుమతులను పొందారు. ఈ కార్యక్రమంలో భాగంగా ద్వితీయ బహుమతులను పొందిన మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా ప్రశంసా పత్రంతో పాటు మెమొంటోను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదువుకుంటూ..పరిశోధన కేంద్రాల్లో ప్రతిభ కనబరుస్తూ..ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యారంగంలో



పోటీ పడడం అభినందనీయమన్నారు. అనంతరం మైనార్టీ గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి, సైన్స్ టీచర్లు శ్రీదేవి, సిహెచ్ రవి, ఎం రవిలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అభినందించారు.

## మహబూబాబాద్ మార్కెట్ ఛైర్మన్ ప్రమాణస్వీకారంలో

# జేబుదొంగల చేతివాటం



**తొలి సమయం మహబూబాబాద్ డిసెంబర్ 8:**
మార్కెట్ ఛైర్మన్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో జేబుదొంగలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల డబ్బులు దోచేసారు. సుమారు 25 మంది వద్ద 5 లక్షల పైగా దోచుకున్నట్లు తెలుస్తోంది.. సీరోలు మండలం కోత్తూరు(సి) గ్రామానికి చెందిన చిట్టూరి లక్ష్మి నారాయణ జేబులో నుంచి రూ.50వేలు. అదే మండలం రేకులతండా కు చెందిన తేజావత్ బాలక్రిష్ణ వద్ద రూ.15 వేలు.. మహబూబాబాద్ పట్టణానికి చెందిన తేజావత్ చిరంజీవి వద్ద రూ.12వేలు. మహబుబాబాద్ మండలం లక్ష్మి పురం గ్రామానికి చెందిన మరో వ్యక్తి దగ్గర రూ.10 వేలు ఇంకొకరి దగ్గర రూ.23 వేలు... ఇలా పదుల సంఖ్యలో భాదితులు మహబూబాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్ కు క్యూ కడుతున్నారు.. గతంలో కెటిఆర్ దీక్ష వేదిక దగ్గర కూడా జేబుదొంగలు పలువురి దగ్గర చేతివాటం ప్రదర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు..

# భక్తులందరిపై అయ్యప్ప స్వామి కరుణ ఉండాలి

**- ఆలయ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేస్తా - ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి**

**తొలి సమయం తొర్రూర్ డిసెంబర్ 8:**
పట్టణంలోని పాటిమీద అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప మాలదారణ భక్తులు కన్నెస్వామి అయ్యప్ప పూజ నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు భక్తులు శాస్త్రోత్తంగా పూజలు నిర్వహించి,అభిషేకాలు చేసిన , ప్రత్యేక పూజలు నిర్వహించిన కార్యక్రమం లో ప్రత్యేక్షంగా పాల్గొన్నారు ఆలయంలోకి వస్తున్న ఆమెకు వేద పండితులు మంత్రోత్సనాలు,పూర్ణకుంభలతో ఘన స్వాగతం పలికారుబి ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ స్వామివారి కన్నెపూజ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు, ప్రజలపై అయ్యప్ప స్వామి కృప తప్పక ఉంటుందని పేర్కొన్నారు, నియోజకవర్గంలో ప్రజలంతా సర్వ దోషాల పోవాలన్నారు, నియోజకవర్గం ప్రజలు సుఖంగా ఉండాలని భగవంతున్ని కోరుకున్నారు ,తెలంగాణ రాష్ట్రం, నియోజకవర్గ ప్రజలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలంటూ ఆకాంక్షించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా కృషి చేస్తామని అన్నారు. ఎమ్మెల్యే గారి వెంట ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళంపల్లి రామచంద్రయ్య,



పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్, మండల అధ్యక్షులు సంచు సంతోష్, సీనియర్ నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, ధరావత్ సోమన్న, బిజ్జల అనిల్ స్వామి, కిషన్ యాదవ్ స్వామి, కృపాకర్ రాజ్, ముఖ్య నాయకులు, ఆలయ అర్చకులు, అయ్యప్ప స్వామి భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పలు మృతుల కుటుంబాలకు ఆత్మీయ ఓదార్పు

**- ధైర్యం చెబుతూ సానుబూతి ప్రకటన. - ఎమ్మెల్యే యశశ్విని ఝాన్సీ రెడ్డి**



**తొలి సమయం తొర్రూర్ డిసెంబర్ 8:**
పలు మృతుల కుటుంబాలకు ఆత్మీయ ఓదార్పుల తో అండగా ఉంటానంటూ ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి సానుభూతి ప్రకటించారు. మండలం లోని గుర్తూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దేవరకొండ శ్రీనివాస్ తల్లి ఇటీవల మరణించగా, ఈ రోజు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, చిత్రపటానికి పాలకుర్తి ఎంమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం అదే గ్రామానికి సంబందించిన గ్రామ పార్టీ అధ్యక్షులు రంగయ్య కోడలు ఇటీవల కాలంలో మరణించగా ఈ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేసారు జీకే



తండా గ్రామ పార్టీ అధ్యక్షులు రమేష్ తండ్రి చంద్రు ఇటీవల మరణించగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101